- కన్నడ రాజ్య మాత

- తమిళ థాయ్

- ఒడిశా ఉత్కల జనని

- చత్తీస్‌గఢ్ మహతారి

- తెలంగాణ తల్లి

పుట్టిన గడ్డను మాతృసమానంగా చూసే సంస్కృతి మనది. అది ఊరు, రాష్ట్రం, దేశం ఏదైనా తల్లిగా భావిస్తాం. మొత్తం భూమండలాన్నే భూదేవత అని కొలుస్తాం. మాతృభూమి కోసం ప్రాణాలు అర్పిస్తాం. ప్రేమ గల్ల తల్లి కోసం త్యాగాలకు వెనుకాడం. అటువంటి తల్లికి రూపం ఇచ్చి పూజించుకోవడం కొత్తకాదు. అనాదిగా వస్తున్న సంప్రదాయమే. స్వాతంత్ర్యానంతరం భారతమాతకు ఎందరో మహానుభావులు మేధస్సును రంగరించి భారత మాత రూపమిచ్చారు. చేతులకు గాజులు, మెడలో ఆభరణాలు, తలపై కిరీటంతో భారతమాతను దేవతామూర్తిగా సకల సౌభాగ్యాలతో తయారు చేశారు. ధీరత్వానికి, వీరత్వానికి ప్రతీకగా దుర్గామాత రూపంలో భారతమాతను పూజిస్తుంటాం. భారతమాతకు జై అనే నినాదం వినిపించినా, ఆలపించినా ఉద్వేగానికి గురవుతాం. భారత మాత విగ్రహానికి భారతదేశం సుసంపన్నమైన దేశంగా, వీరత్వంతో, ధీరత్వంతో ప్రపంచంలో వెలుగొందాలనేది విగ్రహ రూపకర్తలైన మహనీయుల ఉద్దేశం. ఇలా దేశంలోని ఏ రాష్ట్రమాత విగ్రహం చూసినా దేవతా మూర్తిగానే దర్శనమిస్తుంది. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా ఏ రాష్ట్రమాతను చూసినా వైభవం ఉట్టిపడేలా ఉంటుంది. కానీ అద్భుతంగా విలసిల్లిన తెలంగాణ తల్లి విగ్రహ స్థానంలో కొత్త విగ్రహం ప్రతిష్ఠించడం, ఆ ప్రతిమ దీనస్థితిని ప్రతిబింబించేలా ఉన్నదంటూ అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తలరాత మారుస్తనని.. తల్లిని మారుస్తవా?

మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్ పార్టీ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాలరాసేలా అతిపెద్ద అపచారం చేసిందని, పరిహారంగా యావత్ తెలంగాణతల్లికి మంగళవారం నుంచి పాలతో అభిషేకాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆవిష్కరించిన కాంగ్రెస్‌తల్లి విగ్రహంతో అస్తిత్వంపై జరిగిన దాడికి తగిన రీతిలో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న బీఆర్ఎస్ కుటుంబసభ్యులందరికీ, ఉద్యమ నాయకులందరికీ విజ్ఞప్తి చేస్తున్నా... తెలంగాణతల్లిని మళ్లీ ఆవిష్కరించేలా, సోషల్ మీడియా వేదికలపై డీపీలుగా పెట్టుకోవాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో తెలంగాణతల్లి విగ్రహాలకు క్షీరాభిషేకాలు, పంచామృతాలతో అభిషేకాలు చేయాలని కోరారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఏర్పాటు చేసిన తెలంగాణతల్లి విగ్రహాన్ని బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన భారీ బహిరంగ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. 'ఎన్నికలు ఎప్పుడూ జరిగినా... ఘంటాపథంగా 100 సీట్లతో కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన మొదటి రోజునే సచివాలయం ముందు ఏర్పాటుచేసిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సకల మర్యాదలతో గాంధీభవన్‌కు తరలించడం ఖాయం. అదేవిధంగా భస్మాసుర హస్తం చూపుతున్న కాంగ్రెస్‌తల్లిని తెలంగాణతల్లిగా కీర్తిస్తున్నారో.. ఆ విగ్రహాన్ని కూడా గాంధీభవన్‌కు పంపిస్తాం' అని పేర్కొన్నారు. 'చరిత్ర తెలియని మూర్ఖులు మాత్రమే తెలంగాణ చరిత్రను మార్చాలనుకుంటారు. అప్రమత్తంగా ఉండకపోతే, సింహాలు తమ చరిత్రను చెప్పుకోకపోతే, వేటగాళ్లు చెప్పే పిట్టకథలే చరిత్రకు ఆనవాళ్లుగా మారిపోతాయి. సన్నాసులు చెప్పే అబద్ధాలను నిలువరించేలా, తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది' అని కేటీఆర్ వివరించారు.

> బతుకమ్మను మాయం చేయడం తెలంగాణ అస్తిత్వంపై జరుగుతున్న దాడికి పరాకాష్ట. యావత్ జాతిని జాగృత పరిచిన తెలంగాణతల్లి ఒక పార్టీకో, వ్యక్తికో సంబంధించినది కాదు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ అస్తిత్వానికి చిహ్నాలైన బతుకమ్మను, బతుకమ్మ చీరలను, బతుకమ్మ ఆటపాటలను చెరిపి, రానున్న రోజుల్లో తెలంగాణను మాయం చేసే కుట్రలకు తెగబడుతున్నది.
> -కేటీఆర్

మేడ్చల్ సభకు హాజరైన జనవాహినికి అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నిరాహార దీక్షతో దేశాన్ని కదలించి..

దేశ రాజకీయాలను ఒక్క నిరాహార దీక్షతో కదిలించి, కేసీఆర్ అకుంఠిత సంకల్పం, అమరుల ఆత్మబలిదానాలకు చిహ్నంగా ప్రతి ఏటా దీక్షా దివస్ జరుపుకొంటున్నామని కేటీఆర్ గుర్తుచేశారు. తెలంగాణ చరిత్ర ఉన్నంతకాలం కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్ర సాధన సాధ్యమైందనే అంశాన్ని ఎవరూ చెరిపివేయాలేరని పేర్కొన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయినా రేవంత్‌రెడ్డి... ఎప్పటికీ తెలంగాణ ద్రోహిగానే నిలుస్తారని పేర్కొన్నారు. తెలంగాణ తెచ్చి, ఆస్తిత్వానికి ప్రతిరూపమైన కేసీఆర్ ఆనవాళ్లను తుడిచివేసేలా దాడు లు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.

స్ఫూర్తిని రగిలించే తెలంగాణతల్లి రూపం

కాంగ్రెస్‌తల్లి చిత్రాలను చూసి సోషల్‌మీడియాలో జోకులు పేలుతున్నాయని కేటీఆర్ వివరించారు. సెక్రటేరియట్‌లో లంకెబిందెలు లేవని తెలుసుకుని, తెలంగాణతల్లి నెత్తి మీద ఉండే బంగారు కిరీటాన్ని, అత్యంత విలువైన కోహినూర్ వజ్రాన్ని దొంగలు ఎత్తుకుపోయారని జోకులు వేస్తున్నారని చెప్పారు. 'పాల సంద్రంలో ఉద్భవించిన లక్ష్మీదేవి తరహాలో.. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో జనించిన తెలంగాణతల్లి పుట్టింది. తెలంగాణ ఉద్యమ ఉద్వేగానికి ప్రతీకగా తెలంగాణతల్లి నిలుస్తుంది. ఆమె రూపం చూసిన ప్రతి ఒక్కరి గుండెల్లో ఉద్యమ స్ఫూర్తి రగులుతుంది. సాంస్కృతిక వైభవం కండ్లముందు కదలాడుతుంది. యావత్ తెలంగాణ జాతి సమిష్టి ఉద్యమం సాంస్కృతిక పోరాటం గుర్తుకు వస్తుంది. . భాషను వెక్కిరించి, తెలంగాణ నటీనటులను జోకర్లుగా చిత్రీకరించి, ఆటపాటలను ఈసడించుకుని, పెద్దమ్మ, పోచమ్మ, మైసమ్మ, బోనాలను వెక్కిరించిన వారి కండ్లు మూతపడేలా ఉద్యమించిన తెలంగాణతల్లి గుర్తుకు వస్తుంది' అని వివరించారు. 'పుట్టినగడ్డను మాతృమూర్తిగా చూసుకుంటూ కొలుచుకుంటాం. భరతమాతను మొక్కుకుంటాం. భరతమాత విగ్రహం ఎంత అద్భుతంగా ఉంటుందో అందరికీ తెలుసు. గాంధీ అనుకున్నట్టుగా స్వాతంత్ర్యం తర్వాత భరతమాత విగ్రహాన్ని బంగారు కిరీటంతో వారణాసిలో ఏర్పాటుచేశారు. ఇందిరాగాంధీ ప్రధాని అయిన తర్వాత హరిద్వార్‌లో భరతమాతను ఊరేగింపుతో ఏర్పాటుచేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో అదే స్ఫూర్తితో తెలుగుతల్లిని బంగారు కిరీటం, నిండైన ఆభరణాలు, చేతిలో కలశంతో ఏర్పాటుచేశారు. పక్కనే ఉండే తమిళనాడులోనూ తమిళ తాయిలా పేరు పెట్టుకుని వజ్ర వైఢూర్యాలతో ఏర్పాటు చేసుకున్నారు. పక్కన ఉండే కర్ణాటకలో కన్నడ అంబేగా పిలుచుకుంటూ దేవతామూర్తి రూపాన్నిచ్చారు' అని కేటీఆర్ తెలిపారు.

> ఆలిని మార్చిన దుర్మార్గులు ఉంటారు కానీ, తల్లిని మార్చిన మూర్ఖులు ప్రపంచంలో ఎక్కడా లేరు. ఉద్యమ సమయంలో వేలకొద్ది తెలంగాణతల్లి విగ్రహాలను ఊరురా ఏర్పాటుచేశారు. ఎవరు అభ్యంతరం చెప్పారని తెలంగాణ తల్లి రూపాన్ని మార్చారు? ప్రభుత్వాలు మారినప్పుడల్లా.. తలరాతలు మారాలే తప్ప.. తల్లులను మార్చడం అతి పెద్ద తప్పు. ప్రభుత్వం మారితే తెలుగుతల్లి మారిందా? కాంగ్రెస్ నుంచి బీజేపీ వస్తే భరతమాత మారిందా?
> -కేటీఆర్

కాంగ్రెస్ పాలనలో అన్నీ మాయం

తెలంగాణతల్లిని వైతాళికులు, ఉద్యమ, సాహితీ, కవులు, కళాకారులు అద్భుతంగా కీర్తించుకున్నారని కేటీఆర్ గుర్తుచేశారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అన్న మహాకవి దాశరథి మాటలకు 'నా తెలంగాణతల్లి కంజాత వల్లి'గా కీర్తించారు, 'వెల లేని నందనోద్యానం రా నా తెలంగాణతల్లి' అంటూ 70 ఏళ్ల కిందటే రావెళ్ల వెంకట్రామారావు గొప్పగా చెప్పుకున్నారని వివరించారు. 'కళాకారుల ధూంధాంలు, బతుకమ్మ ఆటపాటలు తెలంగాణ చారిత్రక వైభవాన్ని చాటేలా ఉద్యమం ఉవ్వెత్తున సాగింది. ఎంతో గొప్పగా చెప్పుకున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా, ఆస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన ప్రతిరూపమే 2006లో తెలంగాణతల్లిగా పురుడు పోసుకున్నది. ఎంతో ఉద్యమ స్ఫూర్తితో సమైక్యాంధ్ర దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమ వేదికపై తెలంగాణతల్లి వచ్చింది. ఆనాటి ఉమ్మడి పాలకుల దౌర్జన్యాలను అడ్డుకుంటూ జోగులాంబ నుంచి మొదలుకుంటే యావత్ తెలంగాణ వ్యాప్తంగా బతుకమ్మ ఆటపాటలతో ఆడబిడ్డలు ఉద్యమానికి ఊపిరి పోశారు' అంటూ నాటి ఉద్యమ ఘట్టాలను గుర్తుచేసుకున్నారు. తెలంగాణ సంస్కృతికి చిహ్నంగా ఒక చేతిలో బతుకమ్మ, గద్వాల, పోచంపల్లి నేతన్నల కళా నైపుణ్యాలకు ప్రతీకగా నిలిచే పట్టుచీరతో, కరీంనగర్ నుంచి వెండి మట్టెలు, భౌగోళిక మెట్ట పంటలకు నిదర్శనంగా జొన్న కంకులతో కోహినూర్ వజ్రం పొదిగిన బంగారు కిరీటం ధరించిన తెలంగాణ తల్లి విగ్రహంలో రాజసం ఉట్టిపడేదని కేటీఆర్ వివరించారు. ఈరోజు హంతకులే సంతాపం చెప్పినట్టుగా, 1952-2014 వరకు తెలంగాణలో వేలాది మంది చావులకు కారణమై, తొలి దశ నుంచి మలి దశ వరకు ఉద్యమాన్ని తొక్కిపడేసిన ఉద్యమ ద్రోహులు ముందు వరుసలో నిలబడి తెలంగాణతల్లిని పేదరాలిగా చేశారని విమర్శించారు. దివాలా తీసిన రాష్ట్రానికి ప్రతీకగా తల్లి రూపాన్ని దివాలాకోరు నేతలు మార్చివేశారని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద, సునీతా లక్ష్మారెడ్డి, మాగంటి గోపీనాథ్, మాధవరం కృష్ణారావు, బండారి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, పాడి కౌశిక్ రెడ్డి, పార్టీ నేతలు శంభీపూర్ రాజు, మాలోత్ కవిత, తుల ఉమ, రాజశేఖర్‌రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, రసమయి బాలకిషన్, నందికంటి శ్రీధర్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లి విగ్రహాలకు నేడు క్షీరాభిషేకాలు

కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అపచారానికి నిరసనగా మంగళవారం తెలంగాణలో ఉన్న ప్రతి తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకాలతోపాటు పంచామృత అభిషేకాలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లి పేరు చెప్పి.. కాంగ్రెస్‌తల్లి పేరుతో ప్రభుత్వం తీరని అపచారం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ మూర్ఖులు చేసిన ఈ అపచారానికి, చరిత్ర తెలియని కాంగ్రెస్ పార్టీని క్షమించాలని తెలంగాణతల్లిని వేడుకుందామని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ప్రతి ఉద్యమకారుడు, బీఆర్ఎస్ కార్యకర్తలందరూ తమ వాట్సప్, ఇతర సామాజిక మాధ్యమాల్లో తెలంగాణతల్లి చిత్రాన్ని ప్రొఫైల్‌పిక్‌గా పెట్టుకోవాలని కోరారు.

తెలంగాణ తల్లినే బలి చేస్తవా?

- ఢిల్లీ తల్లి కోసమేనా ఈ తంతంగమంతా: కేటీఆర్

హైదరాబాద్,డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): సోనియా బర్త్‌డే అధికారికంగా జరపడం కోసం తెలంగాణ తల్లిని అడ్డం పెట్టుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సోనియా గాంధీని ఒకప్పుడు బలిదేవత అని.. ఇప్పుడు బర్త్‌డే జరుపుతా అంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ మేరకు సోమవారం ఎక్స్‌లో 'ఇదీ అసలు ముచ్చట' అంటూ రేవంత్‌రెడ్డి తీరుపై సెటైరికల్ ట్వీట్ చేశారు.

ఇదీ అసలు ముచ్చట..!!
ఏటా డిసెంబర్ 9ని తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవంగా జరుపుతారట..!
రేవంత్..
సోనియా బర్త్ డేను అధికారికంగా..
జరపడం కోసమా.. ఈ తతంగ మంతా..!!
మీ కాంగ్రెస్ తల్లి బర్త్ డే కోసం..
మా తెలంగాణ తల్లిని బలిచేస్తావా..!!
అంత అభిమానం ఉంటే..
మీ గాంధీ భవన్‌లో జరుపుకో..
లేదా ఢిల్లీ వెళ్లి 10 జన్‌పథ్‌లో చేసుకో..
అంతే కానీ..
మీ పార్టీ జరుపుకోవాల్సిన బర్త్ డే ఫంక్షన్‌ను తెలంగాణ ప్రజలపై బలవంతంగా రుద్దుతావా??
ఒకప్పుడు బలిదేవత అన్నవ్..
ఇప్పుడు బర్త్ డే జరుపుతా అంటున్నవ్..
నీ నాలుకకు నరం ఉండకపోవచ్చు..
కానీ.. తెలంగాణ
ప్రజలకు ఆత్మగౌరవం ఉంది..
పార్టీలు మార్చినంత ఈజీగా..
విగ్రహాల రూపురేఖలు మార్చవచ్చని..
అనుకోవడం నీ మూర్ఖత్వం
తెలంగాణ తల్లి దివ్య స్వరూపాన్ని
కోట్లాది గుండెల నుంచి చెరిపేయొచ్చని
అనుకోవడం నీ అమాయకత్వం
జై తెలంగాణ
జై తెలంగాణ తల్లి

70 ఏండ్ల క్రితం నాటి భారతమాత రూపం ఫొటో చూపుతున్న ఎమ్మెల్సీ వాణీదేవి, చిత్రంలో కేటీఆర్, హరీశ్‌రావు, పద్మారావుగౌడ్, ముఠా గోపాల్, వంటేరు ప్రతాప్‌రెడ్డి

కోహినూర్ గడ్డపై తల్లికి కిరీటం ఉండొద్దా?

- ఎమ్మెల్సీ వాణీదేవి మండిపాటు

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): "కోహినూర్ వజ్రం దొరికిన నేల మీద తల్లికి కిరీటం ఉండకూడదా? 4 కోట్ల తెలంగాణ ప్రజలు ఆరాధించే మాతృమూర్తిని పార్టీ కోణంలో రూపొందిస్తారా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సురభీ వాణీదేవి ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో చేపట్టిన నిరసనలో ఆమె మాట్లాడుతూ తెలంగాణ తల్లి ఈ ప్రాంత అస్తిత్వమని, విగ్రహాన్ని చూస్తేనే దండం పెట్టాలనిపించేలా ఉద్యమనేత కేసీఆర్ రూపొందించారని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రూపొందించిన విగ్రహంలో పేదరికం ఉట్టిపడుతున్నదని విమర్శించారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని పాడుకున్న నేల మీద తెలంగాణ తల్లికి రత్నాలు ఉండకూడదా? అని అగ్రహం వ్యక్తంచేశారు. కేసీఆర్ మీద ఆక్కసుతోనే తెలంగాణ తల్లి విగ్రహం మార్చారని దుయ్యబట్టారు. ఏడు దశాబ్దాల క్రితం భారతమాతను రథం మీద కూర్చోబెట్టి రథసారథిగా జాతిపిత మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ సహా స్వాతంత్ర సమరయోధులు రథంపై ఉన్న చిత్రాన్ని ప్రదర్శించారు. భారతమాత, చాలా రాష్ట్రాల్లోని మాతల విగ్రహాల్లో ఏ విగ్రహం కూడా కిరీటం లేకుండా లేదని చెప్పారు. బతుకమ్మ లేకుండా తెలంగాణ తల్లా ?అని ప్రశ్నించారు. ప్రభుత్వం రూపొందించిన కొత్త విగ్రహాన్ని కాంగ్రెస్ తల్లి గానే చూస్తాం తప్ప, తెలంగాణ తల్లిగా చూడబోమని తేల్చిచెప్పారు.

ఏటా తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం

- డిసెంబర్ 9న అధికారిక నిర్వహణ
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సచివాలయంలో విగ్రహావిష్కరణ

హైదరాబాద్, డిసెంబర్9 (నమస్తే తెలంగాణ): డిసెంబర్ 9న ఏటా అధికారికంగా తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవాన్ని నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం ఉదయం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన తర్వాత శాసనసభలో ప్రకటన చేశారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసిన కాంగ్రెస్ నేత సోనియాగాంధీకి అసెంబ్లీ వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యమంలో పనిచేసిన కవి, గాయకులు గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరి, అందెశ్రీ, గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, జయరాజు, పాశం యాదగిరి, ఎక్కా యాదగిరి రావుకు 300 గజాల ఇంటి స్థలంతోపాటు కోటి నగదు, తామ్ర పత్రం అందిస్తామన్నారు. 16కు అసెంబ్లీ వాయిదా పడింది.

విగ్రహంపై మండలిలో విస్తృత చర్చ

- విగ్రహం, గేయం మళ్లీ మార్చొద్దన్న సభ్యులు
- తెలంగాణ తల్లి భావోద్వేగం: డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్, డిసెంబర్ 8 (నమస్తేతెలంగాణ): తెలంగాణ తల్లి విగ్రహం, గేయాన్ని మార్చకుండా చట్టం తీసుకురావాలని శాసనమండలిలో సభ్యులు అభిప్రాయం వ్యక్తంచేశారు. తరచూ రాష్ట్రానికి సంబంధించిన చిహ్నాలు, విగ్రహం, గేయాన్ని మార్చడం వల్ల భవిష్యత్తు తరాలు రాష్ట్ర ఉనికిని అర్థం చేసుకునే అవకాశం కోల్పోతారని చెప్పారు. సోమవారం శాసనమండలిలో తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ తల్లి అంటే ఒక భావన కాదని, నాలుగు కోట్ల బిడ్డల భావోద్వేగమని పేర్కొన్నారు. విగ్రహాన్ని రాజకీయ కోణంలో చూడొద్దని సభ్యులు పేర్కొన్నారు. చర్చలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సభ్యులు జీవన్‌రెడ్డి, నర్సిరెడ్డి, రఘు మారెడ్డి, తీన్మార్ మల్లన్న, ఏవీఎన్ రెడ్డి పాల్గొన్నారు.

ఏటా తెలంగాణ తల్లి ఉత్సవాలకు వ్యతిరేకం

- ఎమ్మెల్యే సూర్యనారాయణ

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు జరుపుతామని ప్రభుత్వం చెప్పడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ తెలిపారు. ఢిల్లీ పెద్దలు, సోనియమ్మ మెప్పుకోసం రేవంత్‌రెడ్డి ఇదంతా చేస్తున్నారని విమర్శించారు. అందుకే ఒకరోజంతా అసెంబ్లీ నడిపారని దుయ్యబట్టారు. చరిత్రలో ఇలా ఎన్నడూ జరగలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కన్నీరు పెడుతున్న తెలంగాణ తల్లి

- చెరసాలలో బంధించినట్టుంది
- బతుకమ్మనే మాయం చేశారు
- రేవంత్‌రెడ్డి దుశ్చర్యతో ఈ దుర్గతి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి దుశ్చర్యలతో తెలంగాణ తల్లి కన్నీరు పెడుతుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చారని, ఈ చర్య అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. కోట్లాది మంది బిడ్డల్లో స్ఫూర్తిని నింపిన తెలంగాణ తల్లిని మార్చడాన్ని ఖండిస్తున్నామని, ఈ కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని ప్రకటించారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని రహదారిపై ఏర్పాటు చేసి, కాంగ్రెస్ రూపొందించిన తెలంగాణ తల్లిని చెరసాలలో బంధించినట్టు సచివాలయం లోపల ఏర్పాటు చేశారని ఆక్షేపించారు. సామాన్యులు ఎవరైనా తెలంగాణ తల్లికి పూలమాల వేయాలంటే సచివాలయంలోకి అనుమతే ఉండదని తెలిపారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేశారని విమర్శించారు. 'పూలను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమని, అలాంటి బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి మాయం చేయడం ఆక్షేపణీయమని పేర్కొన్నారు. తెలంగాణతనం ఉట్టిపడేలా నాడు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించారని, తెలంగాణ సంస్కృతికి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మకు ప్రాధాన్యం ఇచ్చేలా తెలంగాణ తల్లిని తయారు చేయించారని తెలిపారు. గత 18 ఏండ్లలో ఎప్పుడూ, ఎవరూ కూడా తెలంగాణ తల్లి విషయంలో అభ్యంతరాలు వ్యక్తం చేయలేదని పేర్కొన్నారు. అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం తన అక్కసుతో కాంగ్రెస్ తల్లిగా మార్చిందని ధ్వజమెత్తారు. ఉద్యమకారులపై నాడు తుపాకీని ఎక్కుపెట్టిన రేవంత్‌రెడ్డికి తెలంగాణ తల్లి పేరు పలికే అర్హతే లేదని కవిత స్పష్టంచేశారు. తెలంగాణ తల్లి స్వరూపాన్ని మార్చి ప్రజలను అవమానించిన సీఎం రేవంత్‌రెడ్డి గన్‌పార్క్ వద్ద ముక్కును నేలకు రాయాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీ ఎదుట పోలీసులు అడ్డుకోవడంతో నినదిస్తున్న ఎమ్మెల్సీ కవిత

ఘనంగా విజయ్ దివస్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, డిసెంబర్ 9 : విజయ్ దివస్‌ను సోమవారం బీఆర్ఎస్ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిపారు. తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. కేసీఆర్ 11 రోజులపాటు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతో అప్పటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ఏర్పాటుకు నాంది పలికిన రోజును పురస్కరించుకొని విజయ దివస్ నిర్వహించారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పూలమాలలు వేసి క్షీరాభిషేకం చేశారు.కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. నల్లగొండ ఎన్‌జీ కళాశాల వద్ద మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. యాదగిరిగుట్టలో కేసీఆర్ ఫ్లెక్సీకి గొంగిడి సునీతా క్షీరాభిషేకం చేశారు.

తెలంగాణతల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం

'తెలంగాణ తల్లి' జీవో విడుదల

- చిత్రాన్ని, రూపాన్ని వక్రీకరిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక

హైదరాబాద్, డిసెంబర్ 9 (నమస్తే తెలంగాణ): 'తెలంగాణ తల్లి' రూపాన్ని ఆమోదిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఏటా డిసెంబర్ 9న అధికారికంగా తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నది. తెలంగాణ తల్లి రూపాన్ని వక్రీకరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించింది. తెలంగాణ తల్లి చిత్రాన్ని, రూపాన్ని వక్రీకరించడం, వేరేలా చూపడం నిషేధించినట్టు జీవోలో ప్రభుత్వం పేర్కొన్నది.

అన్ని జిల్లా కేంద్రాల్లో విగ్రహాలు: పొన్నం

తెలంగాణ తల్లి విగ్రహాలను అన్ని జిల్లా కేంద్రాల్లోనూ ఏర్పాటు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తొలుత కాంగ్రెస్ నేత సోనియా గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ పోరాట అంశాలను వివరించారు. ఏటా అవతరణ దినోత్సవాలను నిర్వహిస్తామని వెల్లడించారు.

ఏడాది పాలనను సమీక్షించుకోవాలి

- కూనంనేని సాంబశివరావు

తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణను సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్వాగతించారు. తెలంగాణ తల్లి విగ్రహం రూపకల్పనలో అన్నిపక్షాల అభిప్రాయాలను, సాయుధ రైతాంగపోరాటం ఉద్యమ స్ఫూర్తి, పోరాట పటిమ అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని తెలిపారు. సెప్టెంబర్17ను కూడా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏడాది పాలనపై ప్రభుత్వం సమీక్షించుకోవాలని తెలిపారు.